క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

వాల్మీకిపురం: నగిరిమడుగు పంచాయతీ బురుజుగడ్డ, నగిరిమడుగు, వెలగపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, సర్పంచ్ రజని తెలిపారు. ఇందులో భాగంగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరు కావాలని వారు కోరారు.

కేసు నమోదు

కలకడ : దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిటి స్వామి తెలిపారు. మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ చలమయ్యగారిపల్లెకు చెందిన అక్కులప్ప కుమారుడు ఆనందను కలకడ జండామాను వీధిలో ఉండగా బుధవారం చలమయ్యగారిపల్లె కు చెందిన శ్రీనివాసులు, నాగేష్ కొట్టి గాయపరిచారు. బాధితుడు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నేడు సమావేశం

కురబలకోట: ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ నిర్వాసితులతో ఆర్ అండ్ ఆర్‌పై శుక్రవారం ఉదయం 10 గంటలకు పిచ్చలవాండ్లపల్లె గ్రామం ఎర్రదొడ్డి గంగమ్మ గుడి వద్ద సమావేశం నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు ఎం. భీమేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్థులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి

గుర్రంకొండ: పీఎం కిసాన్ డబ్బుల కోసం రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని మండల ఆర్బీకే ఛైర్మన్ జయచంద్రారెడ్డి, మండల వ్యవసాయాధికారిణి రత్నమ్మ అన్నారు. గురువారం మండలంలోని నడిమికండ్రిగ ఆర్బీకేలో రైతులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెలాఖరులతో పీఎం కిసాన్ రైతు భరోసా డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలో పడతాయన్నారు. మండలంలో ఇప్పటివరకు 1888 మంది రైతులు ఇంకా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. వారంతా తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

సారా స్వాధీనం

పీలేరు రూరల్ : పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఓ నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు సెబ్ ఎస్ఐ వై. గురుప్రసాద్ తెలిపారు. మండలంలోని కోటపల్లె కాలనీలో సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంలో సెబ్ సిబ్బంది దాడి చేశారు. కోటపల్లె కాలనీకి చెందిన బుక్కే సావిత్రమ్మ సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం: ఏడుగురు జూదరులను బుధవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి. వెంకటేష్ తెలిపారు. మండలంలోని శిద్దవరం సమీపంలో మామిడి చెట్టు కింద జూదం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో ఏడుమంది జూదరులు పట్టుబడగా, వీరి నుండి రూ. 1,37,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జూదం ఆడుతున్న వారిలో ఒకరు పరారైనట్లు చెప్పారు. ఈ మేరకు ఎనిమిదిమందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పరామర్శ

గుర్రంకొండ: కార్యకర్తలకు అండగా ఉంటామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎల్లుట్లలో ఆయన పర్యటించారు. రోడ్డుప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణారెడ్డిని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ వెంకట శివారెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, సర్పంచ్‌లు నాగేంద్ర, మస్తాన్ రెడ్డి, ఎంపీటీసీ రాజగోపాల్, నాయకులు రెడ్డి కుమార్, కిరణ్, శివారెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

వాల్మీకిపురం: క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని వాల్మీకిపురం సీఐ సురేష్ అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తికి చెందిన కోటపల్లి అనసూయమ్మ, కోటపల్లి రెడ్డెప్ప రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు కోటపల్లి సనోంద్ర రెడ్డి ఆధ్వర్యంలో మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను సీఐ ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.10,116 , రెండవ బహుమతి రూ. 7,116 అందించనున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థులు

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ దేశ్‌ముఖ్ సుజావుద్దీన్ తెలిపారు. మదనపల్లె జడ్పీహైస్కూల్ మైదానంలో బుధవారం అన్నమయ్య జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూల్ పదోతరగతి విద్యార్థి సుదర్శన్ హైజంప్ అండర్-17లో ప్రథమస్థానం, లాంగ్‌జంప్ అండర్-17లో ప్రథమ స్థానంలో నిలిచారు. 8వ తరగతి విద్యార్థి ప్రేమ్‌నాథ్‌నాయక్ హైజంప్ అండర్-14లో మొదటిస్థానం దక్కించుకున్నారు. వీరిద్దరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 20, 21వ తేదీలలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఆ విద్యార్థులను ఎంఈఓ త్యాగరాజు, ఎంపీడీవో ఆనంద్‌కుమార్ , ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా తెప్ప తిరుణాల





- వేడుకగా శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి గ్రామోత్సవం
- తరలివచ్చిన భక్తజనం

తెప్పతిరుణాల ఉత్సవాల సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తజనం (ఇన్‌సెట్) తెప్పపై విహరిస్తున్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి

గుర్రంకొండ: మండలంలోని తరిగొండలో తెప్ప తిరుణాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని రామానాయిని చెరువు నిండి మొరవపోతే తెప్ప తిరుణాల ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం చెరువు నిండి మొరవ పోతోంది. ఈనేపథ్యంలో గురువారం తెప్ప తిరుణాల ఉత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువు దీర్చారు. అనంతరం భక్తజనం నడుమ వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని పిల్లగోవుల పల్లె, రుద్రావాండ్లపల్లె, ఇరగన్నవారిపల్లె, చెరవుమొరవపల్లె, కురవపల్లె, రెడ్డివారిపల్లెలో స్వామివారిని మేళతాళాలతో బాణాసంచా పేల్చుతూ ఘనంగా ఊరేగించారు. అనంతరం రామానాయిని చెరువు వద్ద రంగురంగుల పుష్పాలతో అలంకరించిన తెప్ప(పడవ)పై స్వామివారిని కొలువుదీర్చారు. చెరువు మొత్తం ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఉత్సవాల్లో ఈ తెప్ప తిరుణాల ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చెరువు వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఏఎస్ఐ నరసింహులు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ తరిగొండ ప్రకాష్‌రెడ్డి, టీటీడీ డెప్యూటీ ఈవో వరలక్ష్మీ, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, ఏఈఓ గురుమూర్తి, ఆలయ అర్చకులు గోపాల బట్టర్, కృష్ణ, అనిల్‌స్వాములు పాల్గొన్నారు.

రక్తదానం

మదనపల్లె సిటీ: స్వామి వివేకానంద జయంతి వేడుకలు మదనపల్లెలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్దనున్న హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 32 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్ధిక్, సభ్యులు రెడ్డప్ప, మస్తాన్, అశోక్, అమీన్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక బీటీ కాలేజీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేశారు. ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

పీలేరు : విశ్రాంతి ఆర్ఐవో ప్రభాకర్ వివేకానంద జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక కోటపల్లె క్రాస్‌లో స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

వాల్మీకిపురం: యువత స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ అన్నారు. గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివేకానంద జయంతిని నిర్వహించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

– డీఎస్పీ కేశప్ప



ఆటోడ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : పట్టణంలో ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీఎస్పీ కేశప్ప ఆదేశించారు. గురువారం జేసీఎం ఫంక్షన్ హాల్‌లో మదనపల్లె సబ్‌డివిజన్ పరిధిలోని ఆటోడ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ.. పట్టణంలో రోజురోజుకీ ట్రాఫిక్ సమస్య జఠిలం అవుతోందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడం, ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులపై ప్రజలను విచారిస్తే ప్రధానంగా ఆటోల కారణంగానే తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిసిందన్నారు. దీంతో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించేందుకు సమావేశాన్ని ఏర్పాటుచేశామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ఆటోడ్రైవర్లు సహకరించాలన్నారు. రికార్డుల క్రమబద్ధీకరణలో భాగంగా ఆటో రికార్డులను కంప్యూటరైజేషన్ చేయించాలన్నారు. షేర్ ఆటోలకు పార్కింగ్ స్థలాలు ఎంపిక చేస్తామన్నారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటుగా నేరాల నియంత్రణకు ఆటోడ్రైవర్లు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో తాలూకా సీఐ సత్యనారాయణ, టూటౌన్ ఎస్ఐ చంద్రమోహన్, వన్‌టౌన్ ఎస్ఐ హరిహర ప్రసాద్, ఆటోయూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సజావుగా అందించాలి

– మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

కేవీపల్లె : ప్రభుత్వ పథకాలు ప్రజలకు సజావుగా అందించడానికి అధికారులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గర్నిమిట్ట, ఎంవీపల్లెలో మండల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు నూతన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు.

యువత క్రీడలపట్ల ఆసక్తి చూపాలి...

గ్రామీణ యువత క్రీడలపట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన శ్రీ గర్నిమిట్ట యల్లమ్మతల్లి మండల స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, సర్పంచ్‌లు రత్నాకర్‌రెడ్డి, రమణమ్మ, ఎంపీటీసీ ఈశ్వరయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు సైపుల్లాఖాన్, మండల ప్రత్యేక ఆహ్వానితులు పి. ద్వారకనాథరెడ్డి, ఎలిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో మదనపల్లె విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె : స్కే(మార్షల్ ఆర్ట్స్) నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అన్నమయ్యజిల్లా మదనపల్లెకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచారని ఏపీ ఛైర్మన్, అన్నమయ్యజిల్లా గ్రాండ్‌మాస్టర్ ఇస్మాయిల్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జనవరి 2 నుంచి 5 వరకు జమ్మూలో జరిగిన స్కే నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 26 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అందులో మన రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహించిన మదనపల్లెకు చెందిన విద్యార్థులు పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి 16 బంగారు, 5 వెండి, 5 రజత పతకాలు సాధించారన్నారు. మాస్టర్ వర్గంలో అన్నమయ్యజిల్లా ప్రెసిడెంట్ నరసింహులు, కార్యదర్శి షేక్ ఫహీం, ఏపీ కోచ్ ఖాదర్‌బాషా బంగారు పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషాను మర్యాదపూర్వకంగా కలుసుకున్న విద్యార్థులు తాము సాధించిన పతకాలను ఆయనకు చూపించారు. విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో యోధ సతీష్, మురళీ ఉన్నారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

ములకలచెరువు: మండలంలో కోడిపందెం ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ డీవై స్వామి గురువారం తెలిపారు. దేవులచెరువు పంచాయతీ రాజుగారిపల్లె వద్ద కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురిని అరెస్టు చేసి రూ.9 వేలు నగదు, మూడు కోళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జగనన్నది జనరంజక పాలన



ప్రమాదబాధితుడి సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



దాదంవారిపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని 29వ వార్డులో గురువారం కౌన్సిలర్ బొమ్మిడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌ఛైర్మన్ జింకా చలపతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి మూడున్నర సంవత్సరాలుగా ఆయా కుటుంబాలకు అందిన పథకాలను వివరించారు. స్థానిక సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఎస్‌బీఐ ఎక్స్‌టెన్షన్ కాలనీలో ప్రమాద బాధితుడు తనను ఆదుకోవాల్సిందిగా చేసిన వినతిమేరకు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నవాజ్ బాషా మాట్లాడుతూ... ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తూ సీఎం జగన్ జనరంజక పాలన చేస్తున్నారన్నారు. మోసపూరిత మాటలు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్షనేత చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ప్రజలు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలన్నింటినీ గమనిస్తున్నారని, తమకు ఎవరి నాయకత్వంలో మేలు జరిగిందో వారినే మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేస్త్రీ శ్రీనివాసులు, షేక్ కరీముల్లా, వసీం, కోఆప్షన్ శారదా రెడ్డి, సర్పంచ్ దండు కరుణాకర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఇర్ఫాన్‌ఖాన్, సదాశివరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రహీం, చంద్రశేఖర్ రెడ్డి, మంజుల, జాన్‌బాబు, రెడ్డిశేఖర్, ఇస్మాయిల్, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

మారుతున్న పేదల తలరాతలు

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట: సీఎం వైఎస్ జగన్ పాలన గడప గడపకు చేరిందని దీంతో అర్జీలు ఇచ్చేవారు కూడా దాదాపు లేరని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని తూపల్లె, దాదంవారిపల్లె, పరదేశిపల్లె, ఏపలపల్లె తదితర గ్రామాల్లో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..లేదా అని విచారించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ సమస్యలు వచ్చాయి. నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. దాదంవారిపల్లె, భద్రయ్యగారిపల్లె పాఠశాలల్లో రూ.32 లక్షలతో నాడు నేడు రెండో విడత పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో సమస్యలన్నీ పరిష్కరిస్తున్నామన్నారు. పేద, మధ్య తరగతి వారి తలరాతలు మారుతున్నాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నో జనరంజక పథకాలు అందజేస్తున్న జగన్ ప్రభుత్వానికి జనం అండగా నిలవాలని కోరారు. డీఆర్. ఉమాపతి రెడ్డి, జడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీపీ బి. దస్తగిరి, బైసాని చంద్రశేఖర్ రెడ్డి, సురేంద్రనాథ్, ఎంపీటీసీ డీఆర్. నిర్మల, ఎస్‌వి. రమణారెడ్డి, డీఆర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎం.ఫిరోజ్‌ఖాన్, ఎం. అంజాద్‌ఖాన్, మధుసూదన్ రెడ్డి, పోరెడ్డి విశ్వారెడ్డి, కోళ్ల వాసు దేవరెడ్డి, శివశంకర్ రెడ్డి, గోపి, ఆనందరెడ్డి, భూదేవి, ప్రభాకర్ రెడ్డి, జల్లు జనార్దన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, బాషా, యుగంధర్ రెడ్డి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



నడిమిచెర్లలో మాట్లాడుతున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నడిమిచెర్ల, కోన పంచాయతీలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నెలకొల్పి సచివాలయాల ద్వారా సేవలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి అభివృద్ధికి నిధులు కోరితే మంజూరుకు ఎంపీ మిథున్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు. సచివాలయాలలో నిత్యం సిబ్బంది అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని, సిబ్బంది హాజరు శాతం తప్పనిసరి చేసిందని, విధులకు డుమ్మాకొడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గంగాపురం సర్పంచ్ రామచంద్ర కత్తివారిపల్లెలో విద్యుత్ స్తంభాలు అవసరమని కోరగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయానికి సమాచారం అందించి వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనారోగ్యంతో ఇంటివద్ద ఉన్న మాజీ సర్పంచ్ రాజారెడ్డిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు నాగమోహన్‌రెడ్డి, కోన సర్పంచ్ జల్లా.రాజగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు క్రిష్ణారెడ్డి, నడిమిచెర్ల సర్పంచ్ నల్లమ్మ, శంకర్ రెడ్డి, బాబురెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్రమణ, జగదీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రాస్తారోకో

బి.కొత్తకోట: మదనపల్లెలో కళాశాలలకు వెళ్లే విద్యార్థులు గురువారం రాత్రి బి.కొత్తకోట మండలంలోని జాతీయరహదారి అమరనారాయణపురంలో రాస్తారోకో నిర్వహించారు. బి.కొత్తకోట-మదనపల్లె మార్గంలోని గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతిరోజూ ఉదయం అంగళ్లు, మదనపల్లెలకు వెళ్తారు. సాయంత్రం తిరిగి గ్రామాలకు వస్తారు. ఇలా రాకపోకలు సాగించేందుకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ సర్వీసులు నడపడం లేదని విద్యార్థులు ఆందోళనకు పూనుకున్నారు. జాతీయరహదారిపై ఆందోళన చేయడంతో బస్సులు, వాహనాలు ఆగిపోయాయి. రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఈ విషయం తెలుసుకొన్న ఆర్టీసీ డీఎం వెంకటరమణారెడ్డి విద్యార్థులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని, శుక్రవారం నుంచి బస్సుల సంఖ్యను పెంచుతామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు తమ ఆందోళన విరమించారు.



విద్యార్థుల ఆందోళనతో నిలిచిపోయిన బస్సులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

వాల్మీకిపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సిహెచ్‌వి రామక్రిష్ణ అన్నారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో 40 మంది టిబి రోగులకు ఆరు నెలలకు సరిపడా పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సోమశేఖర్, మోహన, పివి నారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డెప్ప, ఏజీపీ అశోక్ కుమార్ రెడ్డి, సూపరింటెండెంట్ ఫైరోజా బేగం, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతో క్షయ నిర్మూలన

పీలేరు : సరైన అవగాహన కలిగి ఉండడంతో క్షయవ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చునని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. గురువారం మండలంలోని ముడుపువేములలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి గ్రస్తులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పవన్‌కుమార్, హెచ్‌ఈ కొండయ్య, సీహెచ్‌వో నాగముత్యం , ఏఎన్ఎం వసుంధర, వెంకటరత్నం పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న నిర్మాణాల నిలిపివేత

పీలేరు రూరల్ : స్థానిక రాజీవ్ నగర్ కాలనీ వద్ద రైల్వే ప్రహరీ నిర్మాణం ప్రజలకు ఇబ్బందికరంగా ఉండడంతో నిలిపివేశారు. స్థానిక సమస్యపై రాజీవ్‌నగర్ వాసులు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు మేరకు రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న పనులు నిలిపి వేయాలని ఎంపీ సూచించారు. ఎంపీ, ఎమ్మెల్యే సూచన మేరకు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా సంఘటనా స్థలంకు చేరుకుని పనులు నిలిపివేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ చిన్న, నాగరాజ నాయక్, కళావతి, ఉదయ్‌కుమార్, అబీద్, మునీర్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మునిగోపాలకృష్ణను సన్మానిస్తున్న సీనియర్ సిటిజెన్స్

మదనపల్లె సిటీ: సీనియర్ సిటిజెన్స్ సంక్షేమం కోసం అఖిల భారత సీనియర్ సిటిజెన్స్ ఉపాధ్యక్షులు మునిగోపాలకృష్ణ అందించిన సేవలు ప్రశంసనీయమని ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో మునిగోపాలకృష్ణను అఖిల భారత సీనియర్ సిటిజెన్స్ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఆ సంఘ ఆధ్వర్యంలో సన్మానించారు. మదనపల్లె తాలూకా అధ్యక్షులుగా పని చేసి తరువాత జిల్లా, రాష్ట్ర , జాతీయ స్థాయిలో పదవులు పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె యూనిట్ గౌరవ అధ్యక్షులు మునిరత్నం, ఉపాధ్యక్షులు జగన్‌మోహన్, కార్యదర్శి నాగరాజ, కోశాధికారి ఉస్మాన్ సాహెబ్, బ్యాంకు రమణ సభ్యులు పాల్గొన్నారు.

కోడిపందెం స్థావరాలపై దాడులు నిర్వహించండి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

కలకడ : సారా తయారీ, కోడిపందెం, పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించాలని రామచోటి డీఎస్పీ శ్రీధర్ ఆదేశించారు. గురువారం కలకడ సర్కిల్ కార్యాలయం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కెవిపల్లె పరిధిలో అనేక పాత కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలన్నారు. ప్రతి పంచాయతీకి ఇద్దరు పోలీస్ సిబ్బంది చొప్పున కేటాయించి అసాంఘీక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగేంద్ర, ఎస్ఐ సిటి స్వామి ఉన్నారు.

నేడు వ్యవసాయ సలహా సంఘం సమావేశం

కలకడ : మండల వ్యవసాయ సలహాసంఘం సమావేశానికి మండలంలోని రైతు భరోసా కేంద్రాల అధ్యక్షులు, వ్యవసాయ సలహాసంఘం సభ్యులు హాజరుకావాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి గౌరి కోరారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయశాఖ మండల సలహా సంఘం అధ్యక్షులు చింతకుంట హరినాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నామన్నారు.

పునరావాసానికి వేళాయె

– ముదివేడు రిజర్వాయర్ భూ నిర్వాసితులకు ఇంటి స్థలాలు
– హైవే పక్కన 25 ఎకరాలు సేకరణ

కురబలకోట: కురబలకోట మండలం ముదివేడు రిజర్వాయర్ భూ నిర్వాసితులకు పునరావాస చర్యలు చేపట్టినట్లు తహశీల్దారు ఎం.భీమేశ్వరరావు గురువారం తెలిపారు. ముదివేడు ఫారెస్టుకు ఎదురుగా హైవే పక్కన బైసానివారిపల్లె మార్గంలో ఇంటి స్థలాల కేటాయింపునకు అవసరమైన 25 ఎకరాలను సేకరించామన్నారు. రవాణా ఇతర సౌకర్యాలను పరిశీలనలోకి తీసుకుని మేలైన ఈ స్థలాన్ని ఎంపిక చేశామన్నారు. సకల సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ప్రతి కుటుంబానికి 5 సెంట్లు స్థలం ఇస్తామన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పక్కా ఇళ్లు కట్టిస్తామన్నారు. ఆ కుటుంబంలో 18 ఏళ్లు పైబడిన వారుంటే వారికి కూడా ఇంటి స్థలం ఇస్తామన్నారు. 250 మంది భూ నిర్వాసితులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇంటి స్థలం అవసరం లేనట్లయితే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా వారికి తగిన ఆర్థిక సహకారం అందజేస్తామన్నారు.